క్లుప్తంగా

నేవీలో సబ్ లెఫ్టినెంట్‌గా తాళ్లపూడి యువకుడు



తల్లిదండ్రులతో గూడా విహాస్

తాళ్లపూడి: స్థానిక యువకుడైన గూడా విహాస్ ఇండియన్ నేవీలో సబ్ లెఫ్టినెంట్‌గా నియమితులయ్యాడు. విహాస్ బాల్యం నుంచీ చదువులో చురుకుగా ఉండేవాడు. ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో మూడో ర్యాంక్ సాధించాడు. కోరుకొండ సైనిక్ స్కూల్లో 10+2 పూర్తి చేసిన విహాస్ అనంతరం అంచెలం చెలుగా ఉన్నత చదువు కూడా పూర్తి చేశాడు. అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్‌డీఏ ఎన్ఏ పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రక్షణ దళాల శిక్షణకు ఎంపికయ్యాడు. కేరళలోని ఇండియన్ నావెల్ అకాడమీలో నాలుగేళ్ల శిక్షణ కూడా పూర్తి చేసుకున్న విహాస్ ఇటీవలే ఇండియన్ నేవీలో 2024 బ్యాచ్ సబ్ లెఫ్టినెంట్‌గా నియమితుడయ్యాడు. విహాస్ తల్లిదండ్రులు మాజీ సర్పంచ్ గూడా హరితారాణి, తాళ్లపూడి శ్రీ సాయి స్ఫూర్తి హాస్పిటల్ సీఈవో, వైఎస్సార్ సీపీ నాయకుడు గూడా విజయరాజు. కాగా విహాస్‌ను పలువురు అభినందించారు.

మానవత సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉండ్రాజవరం: మానవత సేవా సంస్థ మండల శాఖ నెల వారీ సమావేశాన్ని సోమవారం పాలంగిలోని మానవత భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 2024–25 సంవత్సరానికి సంస్థ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కఠారి సిద్ధార్థరాజు, కార్యదర్శిగా ఫణితిని పార్వతి, కోశాధికారిగా కోడూరి శ్రీనివాసరావుతో పాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ తాతిన వెంకట కృష్ణారావు, రిటైర్డ్ టీచర్ గజ్జరపు వెంకటేశ్వర రావు, ప్రస్తుత అధ్యక్షుడు కడలి మాణిక్యాలరావు, సుంకవల్లి వెంకటేశ్వరరావు, కె.నాగప్రసాద్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణబాబు కుటుంబానికి పలువురి పరామర్శ

కొవ్వూరు: ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు కుటుంబ సభ్యులను సోమవారం దొమ్మేరు గ్రామంలోని ఆయన స్వగృహంలో పలువురు ప్రముఖులు పరామర్శించారు. అనపర్తి, గోపాలపురం మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు కృష్ణబాబు సోదరుడు అచ్చిబాబును పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కృష్ణబాబు చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు.

మూడు రోజులు విద్యుత్తుకు అంతరాయం

పెరవలి: అన్నవరప్పాడు– మల్లేశ్వరం గ్రామాలకు కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు సబ్ స్టేషన్‌కు కొత్త లైన్ ఏర్పాటు చేసేందుకు మండలంలోని నాలుగు గ్రామాలకు మూడు రోజుల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు. ఖండవల్లి, నల్లాకుల వారిపాలెం, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం గ్రామాలకు ఈ నెల 28 నుంచి 30 వరకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని ఆయన వివరించారు. ఈ మూడు రోజులూ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. అలాగే వ్యవసాయ అవసరాలకు విద్యుత్తు సరఫరాను ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా చేస్తామని చెప్పారు.

జోతిర్లలిత సాయికి బంగారు పతకం



భగవద్గీత సాధన పోటీల్లో గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జ్యోతిర్లలిత సాయి

దేవరపల్లి: మైసూర్ దత్తపీఠం నిర్వహించిన భగవద్గీత సాధన, కంఠస్థ విశ్లేషణ పోటీల్లో దేవరపల్లికి చెందిన అత్తులూరి జ్యోతిర్లలితా సాయి బంగారు పతకం సాధించారు. దత్తపీఠంలో గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా ఈ నెల 20న ఆమె బంగారు పతకం అందున్నారు. సోమవారం ఆమెను కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జ్యోతిర్లలిత సాయి మాట్లాడుతూ దత్తపీఠం ద్వారా గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం తన అదృష్టం అన్నారు. దేవరపల్లి మండల విద్యాశాఖ అధికారి కేఆర్ఎస్‌వీవీ అప్పారావు ఆమెను అభినందించారు.

పుస్తకం.. జ్ఞాన నేస్తం

- విజ్ఞాన గని తాళ్లపూడి శాఖా గ్రంథాలయం
- అందుబాటులో 11 వేలకు పైగా పుస్తకాలు
- నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు అవసరమైనవి కూడా..
- ఉత్సాహంగా విద్యార్థుల వేసవి విజ్ఞాన శిబిరం



తాళ్లపూడి శాఖ గ్రంథాలయంలో పుస్తక నిధి



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తాళ్లపూడి: చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కాని మంచి పుస్తకం కొనుక్కో అనేది సామెత. పుస్తకాలు మన జ్ఞానాన్ని మరింతగా పెంచుతాయి. ఆర్థిక స్తోమత లేని, ఖరీదైన పుస్తకాలు కొనలేని ఎందరో గ్రంథాలయాల్లో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉత్కృష్ట ప్రతిభ కనబరిచి, ఉద్యోగాలు పొందేందుకు గ్రంథాలయాలు బాటలు వేస్తున్నాయి. ఏ ప్రభుత్వాధికారి అయినా తాను నిరుద్యోగిగా ఉన్నపుడు ఏదో ఒక గ్రంథాలయంలోని పుస్తకాలను ఉపయోగించుకునే ఉంటారు. కొవ్వూరు నియోజకవర్గంలోని కొవ్వూరు, చాగల్లులలో కూడా శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి.

విజ్ఞాన భాండాగారంగా..

మండల కేంద్రమైన తాళ్లపూడిలోని శాఖా గ్రంథాలయం పుస్తకాల గనిగా, విజ్ఞాన భాండాగారంగా వెలుగొందుతోంది. ఈ గ్రంథాలయాన్ని 1986లో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ వివిధ రకాల పుస్తకాలు 11,600 అందుబాటులో ఉన్నాయి. తెలుగు సాహిత్యం, పోటీ పరీక్షల పుస్తకాలు, కథలు, నవలలు, సాహిత్యం, మెడికల్ సంబంధ పుస్తకాలు దాదాపు 10,316 వరకూ ఉన్నాయి. ఇంగ్లిషు సాహిత్యం 1,200, హిందీ 78, ఉర్దూ 2, సంస్కృతం 4 పుస్తకాలు ఉన్నాయి. ఇవికాకుండా వీక్లీ, మాస పత్రికలు, ఉద్యోగ సోపానం, విజేత కాంపిటేషన్స్, అందరికీ ఆయుర్వేదం తదితర పుస్తకాలతో పాటు ప్రముఖ దినపత్రికలు అన్నీ ఉన్నాయి. అన్ని పోటీ పరీక్షలు, ఎంట్రన్స్ పరీక్షల పుస్తకాలతో పాటు తెలుగు అకాడమీ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఆర్ఆర్‌బీ , ఐబీపీఎస్, బ్యాంక్ క్లర్క్, వీఆర్వో, వీఆర్ఏ, డీఎస్సీ, గ్రూప్–1, 2, 4, లాసెట్, ఎడ్‌సెట్, డైట్ సెట్, ఐసెట్, ఎంసెట్, పాలిసెట్ వంటి పుస్తకాలు కూడా ఉన్నాయి. అంతేగాకుండా గ్రంథాలయంలో అనేక సదుపాయాలు కల్పించినట్టు లైబ్రేరియన్ ఎ.నరేష్ తెలిపారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు.

తాళ్లపూడి శాఖా గ్రంథాలయం ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు పని చేస్తుంది. ప్రతి శుక్రవారం సెలవు. గ్రంథాలయంలో కంప్యూటర్ ఏర్పాటు చేసి ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించారు. పాఠకులు కేవలం గంటకు రూ.5 మాత్రమే చెల్లించి ఇంటర్నెట్ సేవలను వినియోగించుకోవచ్చు. ప్రింట్ సదుపాయం కూడా ఉంది. దాతల సహకారంతో ఈ గ్రంథాలయంలో 2,000లో సర్వస్వతీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఆహ్లాదకరంగా ఉండేలా లైబ్రరీ ఆవరణలో వివిధ రకాల మొక్కలు పెంచారు. ఈ గ్రంథాలయ అభివృద్ధికి ఈ ప్రాంత దాతలు విశేష తోడ్పాట అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయ భవనంపై మరొక అంతస్తు నిర్మించాల్సిన అవసరం ఉంది. నిత్యం తాళ్లపూడి శాఖా గ్రంథాలయానికి 60–70 మంది వరకూ పాఠకులు వస్తుంటారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలు, గ్రామస్తులు వచ్చి తమకు కావాల్సిన పుస్తకాలను చదువుతుంటారు. గ్రంథాలయ సభ్యత్వం ఉన్న వారికి పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్లే సదుపాయం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి. అంతేగాకుండా ఇటీవల అనేక కొత్త పుస్తకాలు కూడా వచ్చాయి. ఎన్నో విలువైన గ్రంథాలు ఉన్నాయి. గ్రంథాలయ పాఠకుల కోసం ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించాం. విద్యార్థుల కోసం రోజూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. అందరూ గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలి.

– ఎ నరేష్ , లైబ్రేరియన్, తాళ్లపూడి

వేసవి శిబిరం బాగుంది



గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతి రోజూ కథలు చెబుతున్నారు. మాతో చదివిస్తున్నారు. చాలా ఆసక్తికరంగా సాగుతోంది. వివిధ రకాల ఆటలు నేర్పిస్తున్నారు. చెస్, క్యారమ్ బోర్డు నేర్చుకుంటున్నాను.

–షేక్ రఫీ, విద్యార్థి, తాళ్లపూడి

వచ్చేది వర్షాకాలం .. బీ కేర్‌ఫుల్

- జిల్లా సహాయ మలేరియా అధికారి వెంకటేశ్వరరావు
- నల్లజర్లలో పర్యటన



దోమల నివారణపై నల్లజర్ల వాసులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

నల్లజర్ల: రానున్న వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన నల్లజర్లలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ద్వారా సోకే వ్యాధులను వివరించారు.

ఫ్రైడే కార్యక్రమాలు

దోమల నివారణకు ప్రతి శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వరరావు చెప్పారు. నిలువ ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెడతాయన్నారు. ఈ గుడ్లు 8 నుంచి 10 రోజుల వ్యవధిలో పెద్ద దోమలుగా తయారవుతాయన్నారు. పెద్ద దోమలను నాశనం చేయలేం కాబట్టి, వారానికి ఒక సారి నిల్వ నీటిని పారబోయడం ద్వారా దోమల పెరుగుదలను నీటిలో ఉన్నపుడే నివారించవచ్చన్నారు. డెంగీ వ్యాధి నిర్ధారణ (ఎలీసా టెస్ట్) పరీక్షలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చేస్తారన్నారు. రానున్న వర్షా కాలంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు, సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 70 వాహనాల స్వాధీనం

- రికార్డులు చూపించిన 54 వాహనాల విడుదల



పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



దేవరపల్లి మండలం యాదవోలులో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ బాలసురేష్, ఎస్సై శ్రీహరిరావు

పెరవలి: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు సోమవారం మండలంలోని కానూరు అగ్రహారం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు పలు గృహాల్లో సోదాలు చేయడమే గాకుండా, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని మోటార్ వాహనాలను కూడా తనిఖీ చేశారు. ఈ క్రమంలో కానూరు అగ్రహారం గ్రామంలో రికార్డులు చూపించని 70 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించామని పెరవలి ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి తెలిపారు. వాటిలో 54 మోటార్ వాహనాలకు వాటి యజమానులు రికార్డులు చూపించడంతో వారికి అప్పగించామని చెప్పారు. రికార్డులు చూపించవలసిన మరో 16 వాహనాలను ఇప్పటికే స్టేషన్‌లో ఉంచామని తెలిపారు.

దేవరపల్లి మండలంలోని రెండు గ్రామాల్లో..

దేవరపల్లి: మండలంలోని యాదవోలు, చిన్నాయగూడెం గ్రామాల్లో దేవరపల్లి సీఐ కె.బాల సురేష్ ఆధ్వర్యంలో ఎస్సై కె. శ్రీహరిరావు, సిబ్బంది సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దీనిలో భాగంగా 30 ద్విచక్ర వాహనాలను ఆపి రికార్డులు తనిఖీ చేశారు. వాటిలో కొన్నింటికి రికార్డులు లేకపోవడంతో జరిమానా విధించారు. అలాగే చిన్నాయగూడెంలో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

ముంపు సమస్య తీరేలా ఉపాధి పనులు



పెద్దేవంలో పంట బోదెలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఉపాధి హామీ ఏపీవో, వైస్సార్ సీపీ నాయకులు, రైతులు

తాళ్లపూడి: రైతులకు ఇబ్బంది కలగకుండా ఉపాధి హామీ పథకంలో పంట బోదెలు, మురుగు బోదెల్లో పూడిక తీయిస్తామని ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. ఈ వర్షా కాలానికి ముందుగా ఉపాధి హామీ పథకంలో మండలంలోని పెద్దేవం గ్రామంలో చేపట్టే పనులను ఎంపీడీవో, ఉపాధి హామీ ఏపీవో సీహెచ్ రమాదేవి సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ రైతులను, ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, పలువురు రైతులు గ్రామంలోని పంట పొలాల ముంపు సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంట పొలాలు మునిగిపోకుండా బొదెలు, మురుగు బోదెల పూడికను వెంటనే తీయించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అలేఖ్య సువర్చల, రైతులు మైలవరపు రాధాకృష్ణ, చేమకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ ఆదినారాయణ సేవలు భేష్



మున్సిపల్ చైర్మన్, రొటేరియన్ భూపతి ఆదినారాయణను సత్కరించిన రోటరీ సభ్యులు

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మేజర్ డోనర్‌కు సన్మానం

నిడదవోలు: స్థానిక మున్సిపల్ చైర్మన్, సీనియర్ రొటేరియన్ భూపతి ఆదినారాయణ రోటరీ క్లబ్‌కు చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు క్లబ్ సభ్యులు కొనియాడారు. రోటరీ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ ఇంటర్నేషనల్ సంస్థకు రూ.8.30 లక్షలు విరాళంగా అందించి మేజర్ డోనర్‌గా గుర్తింపు పొందిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణను క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు మాట్లాడుతూ భూపతి ఆదినారాయణ రోటరీ ఇంటర్నేషనల్ మేజర్ డోనర్‌గా అరుదైన గౌరవం పొందడం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖకు గర్వకారణమన్నారు. సన్మాన గ్రహీత భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రోటరీ సంస్థ చేస్తున్న సామాజిక సేవల్లో క్లబ్ సభ్యులు ఆర్థిక భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కామిశెట్టి వెంకట సత్యనారాయణ, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, కొత్తపల్లి నాగేశ్వరరావు గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి సాయిబాబు, కేదారిశెట్టి రవికుమార్, గొన్నాబత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



మెరిట్ విద్యార్థినికి స్కాలర్ షిప్ అందిస్తున్న సత్యనారాయణ తదితరులు

చాగల్లు: లకంసాని విరీన్ మానస్ జ్ఞాపకార్థం ఉత్తమ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశామని సాయిరామా సీ ఫుడ్స్ అధినేత లకంసాని సత్యనారాయణ అన్నారు. మల్లవరం గ్రామంలోని ఏపీ గాంధీ స్మారక నిధి కేంద్రంలోని వృద్ధాశ్రమంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు.అలాగే వృద్ధులకు సాయిరామ్ ఫుడ్స్ వారు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విరీన్ మానస్ పేరుతో ఇకపై సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గాంధీ స్మారక నిధి ప్రతినిధి ఇందుకూరి ప్రసాదరాజు, మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు చర్ల మృదుల, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ఐక్యంగా పని చేయాలి

- ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ
- గోపాలపురం మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ

గోపాలపురం: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. గోపాలపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు ఐక్యంగా పనిచేయాలన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కె. రమేష్‌బాబు, సర్పంచులు యండపల్లి శేఖర్‌బాబు, పఠాన్ అన్సర్ బాషా, చిలకా లక్ష్మణస్వామి, గొల్ల కుమార్, ఇళ్ల శ్రీరామమూర్తి, ఎంపీటీసీ సభ్యులు మారాజు రాజేష్, యడ్లపల్లి సూరిబాబు, ఉపాధ్యక్షురాలు వంగా నారాయణమ్మ, వారా సంగీత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పద్యకవి ఆదిబాబుకు సత్కారం



పద్య కవి ఆదిబాబును ఏలూరులో సత్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక సభ్యులు

చాగల్లు: వంద మందికి పైగా కవులు రాసిన సీస పద్యాలను ఏలూరుకు చెందిన శ్రీ శ్రీ కళావేదిక అనే సంస్థ సంకలనంగా తీసుకు వచ్చింది. ఆ రచనను ఏలూరులో ఆదివారం ఆ సంస్థ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఈ పుస్తకంలోని సీస పద్యాలు రాసిన కవులు అందరినీ శ్రీశ్రీ కళావేదిక సంస్థ ఏలూరులో సత్కరించింది. సత్కారం పొందిన సీస పద్య రచయితల్లో చాగల్లు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, యువ కవి వానపల్లి ఆదిబాబు ఒకరు. ఆయనను కూడా శ్రీ శ్రీ కళావేదిక వారు ఘనంగా సన్మానించి, స్వర్ణ కంకణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా సోమవారం చాగల్లు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో వానపల్లి ఆదిబాబును సహచర ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం వీర్రాజు మాట్లాడుతూ ఆదిబాబు ఇప్పటికే మూడు నీతి శతకాలతో పాటు 500 పైగా పద్యాలను చందోబద్ధంగా రాశారన్నారు. సన్మాన గ్రహీత, వానపల్లి ఆదిబాబు మాట్లాడుతూ సాహిత్య సేవ చేస్తున్న శ్రీ శ్రీ కళావేదికకు, పద్య విద్యలో తనకు శిక్షణ ఇస్తున్న గురువు చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులు తటస్థంగా వ్యవహరించాలి

తాళ్లపూడి: ఏ ఒక్క రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ప్రభుత్వోద్యోగస్తులు పూర్తి తటస్థంగా వ్యవహరించాలని ఏపీ జేఏసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం ఆయన తాళ్లపూడిలో మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించి కూడా, కొన్ని రాజకీయ పరిణామాల వల్ల కొందరు సస్పెన్షన్‌కు గురవడం దురదృష్టకరం అన్నారు. కాబట్టి ఉద్యోగస్తులు సోషల్ మీడియా ద్వారా ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలపకుండా జాగ్రత్తగా వ్యవరించాలన్నారు.

2న నన్నయ వర్సిటీలో కౌంటింగ్ ట్రయల్ రన్

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న విషయం తెలిసిందే. దీనిని సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడంలో భాగంగా జూన్ 2న ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ పి.జగదీష్, వివిధ అనుబంధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.

విద్యార్థులకు యోగా శిక్షణ



నిడదవోలు గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



ఉండ్రాజవరం లైబ్రరీలో తాము వేసిన రంగుల చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నిడదవోలు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా సోమవారం విద్యార్థులతో ముందుగా ఇంగ్లిష్ నాలెడ్జ్, మహనీయుల జీవిత చరిత్ర, వేమన, దాశరథి శతకాలు, దేశభక్తి గీతాలు, తెలుగు పద్యాలు చదివించారు. అనంతరం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. వివిధ యోగాసనాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుంచే చినబాబు, ప్రభాకరం, వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉండ్రాజవరం: విద్యార్థులు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు సూచించారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో 13వ రోజు సోమవారం విద్యార్థులకు నీతి కథలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చిత్రలేఖనంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ రంగురంగుల చిత్రాలు గీశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గుత్తికొండ కృష్ణరావు, రీసోర్స్‌పర్సన్ పి.రామదాసు, తదితరులు పాల్గొన్నారు.